



# కరపత్రం

SINCE 2014

గురువారం నవంబర్ 14 2024 | సంపుటి :0 | సంచిక : 36 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా?:

**వెనుకబడిన కొడంగల్‌ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.**



- వెనుకబడిన కొడంగల్‌ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.
- బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

పారిశ్రామిక అభివద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమన్నారు. పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

"భూమి కోల్పోతున్న రైతుల బాధ మాకు తెలుసు. రైతుల బాధను ఇందిరమ్మ ప్రభుత్వం అర్థం చేసుకుంది. భూమి కోల్పోతున్న వారికి మెరుగైన ప్యాకేజీతో పాటు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తాం. ఇళ్లు కోల్పోతున్న వారికి మంచి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తున్నాం. కావాలనే కుట్రపూరితంగా కలెక్టర్‌పై భారాస శ్రేణులు దాడి చేశాయి. అమాయక గిరిజనులను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పారు. కలెక్టర్, అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి సమస్యకు పరిష్కారం కాదు.. కలెక్టర్‌తో చర్చించి పరిష్కరించుకోవాలి. ఇందిరమ్మ రాజ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం భారాసకు ఇష్టం లేదా? ఇది బాధ్యత కలిగిన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదు. ప్రాజెక్టుల కోసం మీరు చాలా భూసేకరణ చేశారు.. ఏనాడూ మేం కాదనలేదు. కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా? అభివృద్ధే మా లక్ష్యం. అధికారులపై దాడి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. మీ కోసం అమాయక ప్రజలు నష్టపోవాలా? ఉద్యమ సమయంలో కూడా ప్రజలను రెచ్చగొట్టి ప్రాణాలు కోల్పోయేలా చేశారు" అని భట్టి విక్రమార్క విమర్శించారు.



## వికారాబాద్ ఘటన..
### నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతాం: పొంగులేటి

హైదరాబాద్: వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు.



## పట్టాలు తప్పిన గూడ్సు..
### 39 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

- జిల్లాలో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దయ్యాయి.
- దక్షిణ మధ్య రైల్వే 39 రైళ్లు రద్దు చేయడంతో పాటు 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది.

పెద్దపల్లి: జిల్లాలో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే 39 రైళ్లు రద్దు చేయడంతో పాటు 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. 53 రైళ్లను దారి మళ్లించారు. 7 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. నర్సాపూర్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-నాగ్‌పుర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్-కరీంనగర్, కరీంనగర్-బోధన్,

2 లో

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారులపాలు

**వారం రోజులుగా కొనుగోళ్ల కేంద్రాల వద్దనే ధాన్యం బోనస్ మాట దేవుడెరుగు.. కొనే నాథుడే లేడు : మాజీ మంత్రి హరీశ్‌రావు**



2 లో

## లగచర్ల పర్యటనకు ఎంపీ డీకే అరుణ.. అడ్డగించిన పోలీసులు



- భాజపా ఎంపీ డీకే అరుణ లగచర్ల పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.
- లగచర్ల వెళ్తుండగా పూడూరు మండలం మన్నెగూడ వద్ద పోలీసులు డీకే అరుణను

2 లో

## లగచర్ల ఘటన భారాసకు అంటగట్టే యత్నం: మాజీ మంత్రి సబిత



- లగచర్ల ఘటనను భారాసకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

2 లో

# కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టడానికికే ఢిల్లీకి వెళ్లా



- కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు మొదలైంది
- రైతుల సమస్య కూడా పరిష్కరించని సంస్కారం కాంగ్రెస్‌ది
- 9 నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నా సీఎంకు కలిసే తీరిక లేదా..?
- తెలంగాణ భవన్ ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి కేటీఆర్

2 లో

## బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.

హైదరాబాద్: అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దాని పునరుద్ధరణపై స్థానికులతో మాట్లాడారు. నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించడంతో 16 ఎకరాలు ఉన్న బతుకమ్మ కుంట 5.15 ఎకరాలకు కుచించుకుపోయిందని,

2 లో

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారులపాలు

మొదటిపేజీ తరువాయి

: క్వింటాల్‌కు రూ. 500 ఇస్తానన్న సీఎం రేవంత్ బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడే లేడని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలైందని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతేడాది నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే ఈ సంవత్సరం కృష్ణా నదిలో పుష్కలంగా నీళ్లు రావడం వల్ల ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. సాగు పెరిగిన కారణంగా నల్గొండ జిల్లాలో ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంచనా వేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేసే పరిస్థితి నల్గొండ జిల్లాలో లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలయిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేక, గన్నీ బస్తాలు అందించలేక రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులు రూ .1800లకు క్వింటాల్ చొప్పున దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేను అడుగుతున్నాను ఎన్నికల ముందు బాండ్ పేపర్ రాసి రైతులకు 500 బోనస్, 15000 రైతుబంధు ఇస్తానని చెప్పి మాట తప్పవా లేదా? రైతుల వడ్ల లోడ్ ఎత్తమంటే మహారాష్ట్రకు నోట్లో కట్టల లోడ్ ఎత్తుతున్నాడు ముఖ్యమంత్రి. నల్గొండ జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, రూ. 200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటే అందులో రూ. 50 కోట్లు మాత్రమే చెల్లించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని హరీశ్‌రావు తెలిపారు. వడ్లకు మద్దతుధర వస్తలేదని రైతులు మిర్యాలగూడలో రాస్తారోకో చేసిన పరిస్థితి. కొన్న వడ్లకు కూడా విపరీతంగా తరుగు పెట్టి రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. నిన్న జగిత్యాల జిల్లా పర్యటనలో అక్కడి రైతులని అడిగితే ఒక కిలో సన్నవడ్లు కూడా కొనలేదని చెప్పారు. ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో కూడా ఒక కిలో సన్న వడ్లను కొనలేదు. సన్న వడ్లను కొనే వ్యవస్థ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టడానికికే ఢిల్లీకి వెళ్లా

మొదటిపేజీ తరువాయి

నేను ఢిల్లీకి వెళ్లింది అనుముల కుటుంబ కుంభకోణాలు బయటపెట్టేందుకు వెళ్లానని, మళ్లీ కూడా కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అంశం, రాష్ట్రంలో భూసేకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దురాగతాలపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఢిల్లీకి వెళితే బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా..? మరీ బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్ రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా..? అదానీ కాళ్లు పట్టుకొని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మీద ఈడీ కేసు కాకుండా చూసుకున్నాడా..? లేదా..? చెప్పండి. నేను మలేషియా వెళ్లకుండానే వెళ్లినట్లు మీడియా వాళ్లు ఎలా రాస్తారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ తుగ్లక్ ప్రభుత్వం నిర్లయం కారణంగా అధికారులు బలి అవుతున్నారు. ప్రభుత్వం కుట్రలో అధికారులు బలి కావద్దని కోరుతున్నా. కొడంగల్‌లో రైతులతో భూసేకరణ పంచాయితీ వచ్చినప్పుడు పిలిచి మాట్లాడని కుసంస్కార ప్రభుత్వం ఇది. మా ప్రభుత్వంలో కూడా భూ సేకరణ సమస్యలు వస్తే రైతులను మెప్పించి ఒప్పించి, వాళ్ల కడుపులో తల పెట్టి మేము మంచి పరిహారం ఇచ్చాం. మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టును పూర్తి చేశాం. కానీ ఈ ముఖ్యమంత్రికి 9 నెలలుగా కొడంగల్‌లో ఆందోళన చేస్తున్న రైతులను కలిసే సమయం లేదని కేటీఆర్ మండిపడ్డారు. కలెక్టర్రే స్వయంగా దాడి జరగలేదని చెబుతున్నాడు. ఐజీ మాత్రం దాడి జరిగిందంటున్నారు. కానీ ఇది ఇంటలిజెన్స్ వైఫల్యం. దాడి జరుగుతున్న సమయంలో సెక్యూరిటీ ఏదీ? ఉద్దేశ పూర్వకంగా గొడవ సృష్టించి రైతులు భూసేకరణకు సహకరించటం లేదని భూములను గుంజుకునే కుట్ర చేస్తున్నారు. ముఖ్యమంత్రికి రియల్ ఎస్టేట్ ఫార్ములా, బ్యాగ్‌ల ఫార్మ్యులా మాత్రమే తెలుసు. ఈయనకు ఈ రేస్ అంటే ఏంటో తెలుసా..? అని ప్రశ్నించారు. 11 నెలలుగా రోజుకో కుంభకోణం పేరుతో టైంపాస్ ప్రచారం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని మీడియా కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. మేము తప్పకుండా లగచర్ల రైతులకు అండగా ఉంటాం. ఆ ప్రాంతానికి మా పార్టీ నాయకులం వెళ్తాం. పీడిత, గిరిజన రైతులకు మేము కచ్చితంగా అండగా నిలబడతాం. లంబాడా హక్కుల సమితి వాళ్లను కూడా కలిసి వాళ్లతో పోరాటం చేస్తాం. భూ సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి కుటుంబం చేస్తున్న దోపిడీ ప్రజల ముందు పెడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## వయనాడ్ ప్రజలు ఓ ఛాన్స్ ఇస్తారని భావిస్తున్నా: ప్రియాంకా గాంధీ



**వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.**

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎన్నికలో ప్రజలు తనకు ఓ అవకాశం ఇస్తారని ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. వారు తనపై చూపించిన ప్రేమను తిరిగి ఇవ్వాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కేరళలోని వక్ఫ్ చట్టం, కొండ చరియలు విరిగిపడిన వయనాడ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సహాయం అందకపోవడం వంటి విషయాల గురించి విలేకరులు ప్రశ్నించగా.. ఇవాళ ఎలాంటి వివాదాస్పద అంశాల జోలికి వెళ్లదల్చుకోలేదంటూ ఆమె సమాధానమిచ్చారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంతోపాటు యూపీలోని రాయ్‌బరేలీలోనూ రాహుల్ గెలుపొందడంతో వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానం నుంచి బరిలోకి దిగిన ప్రియాంకను ఐదు లక్షల మెజార్టీతో గెలిపిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ప్రియాంక వయనాడ్‌లో పార్టీ తరఫున విస్తృత ప్రచారం నిర్వహించి.. కీలకపాత్ర పోషించారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నేడు జరుగుతుండగా.. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# త్వరలో హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య: ప్రధాని మోదీ

**రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**



లఖ్‌నవూ: త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. బిహార్ లోని దర్భంగా లో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్ కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు.బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# దిల్లీలో క్షీణించిన గాలి నాణ్యత.. 400 దాటిన ఏక్యూఐ

దిల్లీలో గాలి నాణ్యత క్షీణించడంతో దేశరాజధానిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దిల్లీ: దేశ రాజధాని దిల్లీని కాలుష్యపు పొగ కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ 400 దాటడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దిల్లీతో పాటు నోయిడా, గాజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్‌లో తీవ్రమైన పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 మార్క్‌ను అధిగమించి 'తీవ్రమైన కేటగిరి'లోకి చేరింది. నోయిడా, గురుగ్రామ్, గాజియాబాద్‌లలో గాలి నాణ్యత 188 గా ఉంది. దీంతో హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో నీటిని జల్లులుగా చిలకరించడంతో పాటు నిర్మాణ, కూల్చివేత ప్రదేశాలలో ధూళి నియంత్రణ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బిహార్‌లోని మూడు నగరాలతో పాటు హరియాణాలోని రెండు నగరాలు, చండీగఢ్ ప్రాంతాలు దేశంలోని టాప్ 10 కాలుష్య ప్రదేశాలుగా గుర్తించారు.

ఇదిలా ఉండగా.. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఐక్యరాజ్యసమితి చిల్డ్రన్ ఫండ్ (యూఎన్ఐసీఈఎఫ్) పేర్కొంది. ఈ నేపథ్యంలో పలు హెచ్చరికలు సైతం జారీ చేసింది.

పలు విమానాలు ఆలస్యం..

దట్టమైన పొగమంచు కమ్మేయడంతో దిల్లీ, అమృత్‌సర్ నుంచి పలు ఇండిగో విమానాలు ఆలస్యంగా నడిచాయి. మంగళవారం అర్ధరాత్రి పంజాబ్ నుంచి దిల్లీకి వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం సైతం పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపారు.

## పట్టాలు తప్పిన గూడ్సు..

### 39 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

మొదటిపేజీ తరువాయి

సిర్పూర్ టౌన్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్షా, బల్లార్షా-కాజీపేట, యశ్వంత్‌పూర్-ముజఫర్‌పూర్, కాచిగూడ-నాగర్‌సోల్, కాచిగూడ-కరీంనగర్, సికింద్రాబాద్-రామేశ్వరం, సికింద్రాబాద్-తిరుపతి, ఆదిలాబాద్-పర్లి, అకోలా-పూర్ణ, ఆదిలాబాద్-నాందేడ్, నిజామాబాద్-కాచిగూడ, గుంతకల్లు-బోధన్ రైళ్లను రద్దు చేశారు.

పెద్దపల్లి-రామగుండం మధ్య రాఘువాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్సు రైలు బోల్తాపడింది. ఐరన్ కాయిల్స్‌తో వెళ్తున్న రైలు ఓవర్‌లోడ్‌లో 11 వ్యాగన్లు బోల్తా పడ్డాయి. వేగంగా వెళ్తున్న రైలు బోగీల మధ్య ఉన్న లింక్‌లు తెగిపోవడంతోపాటు ఒకదానిపై మరో బోగి పడి మూడు ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. రాత్రి నుంచి ఘటనాస్థలిలో పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన కారణంగా దిల్లీ, చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రాఘువపూర్ సమీపంలో యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ట్రాక్‌పై బోల్తాపడిన గూడ్స్ డబ్బాలను సిబ్బంది తొలగిస్తున్నారు. తెగిపడ్డ విద్యుత్తు తీగలను పునరుద్ధరిస్తున్నారు. కొత్త పట్టాలను ఘటనా స్థలికి తెప్పించి శరవేగంగా పట్టాలను అమర్చుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

### లగచర్ల పర్యటనకు ఎంపీ డీకే అరుణ..

## అడ్డగించిన పోలీసులు

మొదటిపేజీ తరువాయి

పూడూరు: భాజపా ఎంపీ డీకే అరుణ లగచర్ల పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. లగచర్ల వెళ్తుండగా పూడూరు మండలం మన్నెగూడ వద్ద పోలీసులు డీకే అరుణను అడ్డుకున్నారు. ఆమె కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుంటే అడ్డుకోవడమేంటని పోలీసులపై మండిపడ్డారు. దీంతో అక్కడి నుంచే వికారాబాద్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో డీకే అరుణ ముందుకు వెళ్లేందుకు అనుమతించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని లగచర్లలో అధికారులపై దాడి ఘటన గురించి కలెక్టర్‌తో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## లగచర్ల ఘటన భారాసకు అంటగట్టే యత్నం: మాజీ మంత్రి సబిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: లగచర్ల ఘటనను భారాసకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ని పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో సబిత ఫిల్మ్‌నగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.

"వికారాబాద్ జిల్లా లగచర్లలో జిల్లా కలెక్టర్, అధికారులపై జరిగిన దాడి బాధాకరం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడి భారాస చేయించిందని అంటగట్టే ప్రయత్నం జరుగుతోంది. నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే మా పార్టీ సైలెంట్ అవుతుందని అనుకుంటున్నారు. అరెస్ట్‌లకు భయపడం.. ప్రజా గొంతుకగా ఉంటాం. ఫార్మా సిటీపై ప్రభుత్వానికే స్పష్టత లేదు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలి" అని సబిత అన్నారు. పట్నం నరేందర్‌రెడ్డి సతీమణి శ్రుతి మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు కేబీఆర్ పార్కులో వాకింగ్‌కు వెళ్లామని.. పోలీసులు అక్కడే ఆయన్ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

### బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



మొదటిపేజీ తరువాయి

స్థానికుల విజ్ఞప్తితో చెరువు పునరుద్ధరణ పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. నివాసాలు, నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదంటూ స్థానికులకు రంగనాథ్ భరోసానిచ్చారు. హైడ్రా కమిషనర్ రాకతో బతుకమ్మ కుంట పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు భద్రత మధ్య రంగనాథ్ బతుకమ్మ కుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు. కుంటను పునరుద్ధరిస్తాం. కూల్చివేతల చేపడతామనే అపోహ స్థానికుల్లో ఉంది. దాన్ని తొలగించేందుకే బతుకమ్మకుంటకు వచ్చాను. ప్రస్తుతమున్న ఐదు ఎకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధరణ చేస్తాం. చెరువులోకి వరద నీరు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చిస్తాం. హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారం ఉంది. ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు వెళ్తూనే ఉంటాయి"అని రంగనాథ్ తెలిపారు.

# బొల్లారం మున్సిపల్ ఉద్యోగి మృతి

- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా
- బాధితుని కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ధర్నా విరమించమని డిమాండ్ చేసినఆనంద్ కృష్ణారెడ్డి
- ఎట్టకేలకు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఆర్డీవో రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంగతాయారు అధికారుల హామీ
- ధర్నా విరమించిన మున్సిపల్ కార్మికులు, ప్రముఖ సంఘ సేవకులు
- సపాయి కార్మికుడి అంత్యక్రియలకు పదివేల ఆర్థిక సహాయం అందించిన
- కే జి ఆర్ ఫౌండేషన్ అధినేత ఆనంద్ కృష్ణారెడ్డి





**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డా. ఏర్పుల శ్రీనివాస్.**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ కార్యాలయానికి చెందిన మున్సిపల్ సపై కార్మికుడు మరణించడం జరిగింది, అతను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తిగా చాలీచాలని జీతంతో ఉదయం నుండి రాత్రి వరకు మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి చెత్త చదారం మురుగు కాలువలు శుభ్రం చేస్తూ అనారోగ్యం చెంది విధి నిర్వహణలో మరణించడం జరిగింది,అయినా ఆ నిరుపేద సపై కార్మికుడికి ప్రభుత్వ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ అతని కుటుంబానికి ఎటువంటి నష్టపరిహారం కానీ ప్రభుత్వ సహాయం గానీ అందించకపోవడం విడ్డూరంగా ఉందని,నిరంతరం మున్సిపల్ కార్యాలయం ద్వారా చాకిరీ చేయించుకొని వారి కుటుంబాన్ని ఆదుకోకపోవడం విషం పై కే జి ఆర్ ఫౌండేషన్ అధినేత సామాజిక సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 10వేల రూపాయలు తక్షణమే తన కుటుంబాన్నికి ఆర్థిక సహాయాన్ని అందించి, మరణించిన ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని వారికి ఉండడానికి ప్రభుత్వ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఆర్థిక సాయం కూడా అందించాలని మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తు జిల్లా ప్రభుత్వ అధికారులు తక్షణమే సంఘటన స్థలాన్ని కి రావాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది , తక్షణమే ప్రభుత్వ అధికారులు బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉదయం నుండి సాయంత్రం వరకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, అనంతరం ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన సఫాయి కార్మికులతో నిరంతరం గుడ్డ చాకిరి చేయించుకొని వారికి ఈఎస్ఐ పీఎఫ్ కూడా అవకాశాలు కల్పించకుండా చాలీచాలని జీతాలు ఇచ్చి 150 మంది కార్మికులు ఉండాల్సినటువంటి మున్సిపల్ కార్యాలయంలో 50 మందితో మాత్రమే పని చేయించుకుంటూ వారి ఆలనా పాలన మరిచి వారికి అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్నప్పటికీ వారి సంక్షేమాన్ని మరిచి వారికి సాలీసాలను జీతాలను ఇస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వారి సంక్షేమం మరవడం బాధాకరమన్నారు, సఫాయి కార్మికులకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని, బొల్లారం మున్సిపల్ కార్యాలయం సఫాయి కార్మికుని కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని జిల్లా ఉన్నత అధికారులను సంబంధిత ప్రభుత్వ అధికారులను ఆనంద్ కృష్ణారెడ్డి డిమాండ్ చేయడం జరిగింది,బాధిత కుటుంబానికి అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతానని కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం సంసిద్ధం చేస్తానని అన్నారు.తక్షణమే ప్రభుత్వ అధికారులు ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి, బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని నిరసన కార్యక్రమాన్ని విరమింప చేస్తూ బొల్లారం మున్సిపల్ సఫాయి కార్మికుడు మరణించడం అతని కుటుంబానికి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని స్పందిస్తూ మరణించిన మున్సిపల్ సపాయి కార్మికుడికి న్యాయం జరిగే విధంగా వారి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించుటకు ఉన్నత అధికారులకు సిఫారసు చేస్తున్నామని హామీ ఇవ్వడం జరిగింది.అనంతరం ఆనంద్ కృష్ణా మున్సిపల్ సప్తై కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని విరమించుకోవడం జరిగింది.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఒడితల ప్రణవ్ బాబు...



**కరపత్రం ప్రతినిధి,వీణవంక, నవంబర్ 13.**
వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాంద్ర లక్ష్మణ్ కుమారుడైన తాంద్ర శ్రీహస్, ఇటీవలే కరీంనగర్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా,బుధవారం వారి కుటుంబన్ని పరామర్శించిన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు మృతికి గల కారణాలు మృతుని తండ్రి లక్ష్మన్ అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే గ్రామం లో ఇటీవల మృతి చెందిన ఎదులాపురం వెంకటేశ్వర్లు, గంజి లక్ష్మీనర్సు కుటుంబాలను పరామర్శించారు.వారి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు నల్ల కొండల్ రెడ్డి, ఈదునూరి పైడి కుమార్, ఎండి ఎజాజ్ పాషా, అలె మధుసూదన్, కార్తీక్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో శంకరపట్నం రెండు పదవులు..

- నాంపల్లి వైస్ చైర్మన్, తణుక డైరెక్టర్...

**కరపత్రం శంకర పట్నం నవంబర్ 13**
కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలానికి హుజరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో ఇద్దరికీ అవకాశం కల్పించింది. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం





కేశవపట్నం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సాంఘిక సేవాకర్త, మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తణుకు ప్రభాకర్, కాచాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి తిరుపతి డైరెక్టర్ స్థానం కేటాయించి, నాంపల్లి తిరుపతికి వైస్ చైర్మన్ పదవి కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషిచేసిన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, టిపిసిసి సభ్యులు శంకరపట్నం మండలం మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ శంకరపట్నం మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ తోపాటు ఇతర రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, ప్రభాకర్ తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

# కులగణనతో దేశం చూపు తెలంగాణ వైపు

- సర్వేతో సబ్బండ వర్గాలకు సామాజిక న్యాయం
- జిల్లా కాంగ్రెస్ నాయకుడు బిసి నేత సాయిలి. ప్రభాకర్

**కరపత్రం వరంగల్,/ గీసుకొండ ప్రతినిధి నవంబర్ 13**

**వరంగల్ జిల్లా గీసుకొండ మండలం.**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన సర్వే ప్రశాంతంగా జరుగుతుంది . బుధవారం కొమ్మాల గ్రామంలో సర్వేలో ఇంటింటా తిరుగుతూ అధికారులతో కలిసి జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి. ప్రభాకర్ పాల్గొని న్యూస్ టుడే తో మాట్లాడుతూ ప్రజలు సర్వేకు వచ్చిన ఎనిమిరేటర్లకు స్వచ్ఛందంగా



సహకరిస్తున్నారు కులగణన ద్వారా రాష్ట్రంలో సబ్బండ వర్గాలకు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా సామాన న్యాయం జరుగుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో కులగణన మొట్టమొదటిసారి సర్వే తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్నారు తద్వారా రాబోయే రోజులలో దేశమే తెలంగాణ వైపు చూస్తూ మాకు సమాన న్యాయం కోసం కులగరణ చేయాలని అన్ని రాష్ట్రాల ప్రజలు కోరుకుని ప్రభుత్వాలపై యుద్ధం చేస్తారని ఒత్తిడి తెస్తారని వివరించారు పార్లమెంటులో కులగణన పై రాహుల్ గాంధీ తన గొంతెత్తి మాట్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా అణగారిన వర్గాలకు బీసీలకు వ్యతిరేకిగా ప్రధాని మోడీ బిజెపి పార్టీలు మారాయని అన్నారు బిఆర్ఎస్ పార్టీ వారు చేసే విష ప్రచారాన్ని ప్రజలు నమ్మరని సాయిలి.ప్రభాకర్ ఎద్దేవా చేశారు ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రేమల్లి. శంకర్రావు ఎనిమిరేటర్ రాయపూడి చంద్రమౌళి ఎడ్ల. సతీష్ బస్కి మహేందర్ సర్వేకు సంబంధించిన కుటుంబ సభ్యులు హాజరయ్యారు

## కలంతో పోరాడిన బలశాలి కాళోజీ...

- ఎమ్మెల్యే కవ్వంపల్లి...

**కరపత్రం శంకర పట్నం నవంబర్ 13**



నిజాం అరాచక పాలన, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప కలం యోధుడు కాళోజీ నారాయణరావు అని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం కాళోజీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిజాం అకృత్యాలపై కలంతో పోరాడిన బలశాలి కాళోజీ అని ఆయన పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు తాను బతికినంత కాలం ప్రజల గొంతుకగా పని చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ పోషించిన పాత్ర మరువలేదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. తన రచనలు, సాహిత్యంతో తెలంగాణ సమాజాన్ని జాగృతపర్చిన నిత్య చైతన్యశీలి కాళోజీ అని ఆయన కీర్తించారు.కాళోజీ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రజల హక్కులపై పాలకులను నిగ్గదీశారని ఎమ్మెల్యే సత్యనారాయణ గుర్తు చేశారు.

# వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు నియామక ప్రక్రియ.

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి. నవంబర్ 13**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు జరుగుతున్న నియామక ప్రక్రియకు సంబంధించిన ఒక సమస్యను అభ్యర్థులందరికీ తెలియజేయడం జరుగుతోంది. ఈ నియామక ప్రక్రియ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆధ్వర్యంలోని జిల్లా సెలక్షన్ కమిటీ పర్యవేక్షణలో జరుగుతుందని స్పష్టంగా తెలియజేయడం జరుగుతోంది.ఇటీవలి కాలంలో, కొంతమంది అభ్యర్థులకు అనుమానాస్పద కాల్స్ వచ్చినట్లు మాకు ఫిర్యాదులు అందాయి. ఈ అభ్యర్థులకు "09836330846 ఫోన్ నంబర్ నుండి కాల్స్ వచ్చాయి, ఇందులో కాల్ చేసిన వ్యక్తి తాను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా చెప్పుకొని, అభ్యర్థులు ఎంపిక అయినట్లు మరియు వారి ఖాతాలోని "డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ " పేరుతో ఉన్న గూగుల్ పే నంబర్/ఫోన్ పే నంబర్ 7003386564 కి డబ్బులు చెల్లించాలని చెప్పడం జరిగింది.ఈ ఘటనకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున పోలీస్ శాఖకు ఫిర్యాదు చేయడం జరిగినది , 790/2024 ఎఫ్ఐఆర్ ను 12-11-2024 తేదీన షామీర్పేట్ పోలీస్ స్టేషన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో నమోదు చేయడం జరిగింది. ఐటీ చట్టం -2008 ప్రకారం 319(2), 318(4) బి ఎన్ ఎస్ 66సి , 66D సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభమైంది. ఈ దర్యాప్తు ద్వారా నేరస్థులను గుర్తించి వారిని శిక్షించాలని లక్ష్యంగా పనిచేస్తున్నారు.కావున, ఈ నియామక ప్రక్రియలో ఉన్న అభ్యర్థులందరికీ ఏవైనా అనుమానాస్పద కాల్స్ వస్తే నమ్మవద్దని విజ్ఞప్తి చేయడమైనది. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ అధికారిక వెబ్సైట్ https://medchal-malkajgiri.telangana.gov.in లో లేదా స్థానిక తెలుగు దినపత్రికల ద్వారా మాత్రమే పొందవచ్చు.అభ్యర్థులు లేదా వారి కుటుంబ



సభ్యులు ఎవరైనా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారుల పేరుతో అనుమానాస్పద కాల్స్ అందిస్తేంటనే తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ ) వాట్సాప్ హెల్ప్లైన్ నంబర్ 9440446106, టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా ఈమెయిల్ dg_acb@telangana.gov.in ద్వారా సంప్రదించగలరు.ఇది ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విడుదల చేయబడిన ప్రకటన.

## పలు శుభకార్యాలకు హాజరైన ఒడితల ప్రణవ్ బాబు...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, నవంబర్ 13.**




వీణవంక మండలంలో బుధవారం హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు పలు శుభకార్యాలకు హాజరయ్యారు.బ్రాహ్మణపల్లి గ్రామంలో మండల రాజయ్య కుమార్తె మండల స్వప్న- రాజ్ కుమార్, వల్బ పూర్ గ్రామంలో దొమ్మటి మొండయ్య కుమారుడు లక్ష్మణ్ - నవ్య, నర్సింగాపూర్ గ్రామంలో శీలం లింగారెడ్డి కుమార్తె శీలం దివ్య - వేణు రెడ్డి, బొంతుపల్లి గ్రామంలో ఎండీ సలీం కుమార్తె, ఎండి ఉజ్మ - ఆరిఫ్ ల వివాహాలకు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడిదల ప్రణవ్ బాబు వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు కర్ర భగవాన్ రెడ్డి, ఎక్కడి రఘుపాల్ రెడ్డి,నల్ల కొండల్ రెడ్డి, ఈదునూరి పైడి కుమార్, కామెడీ శ్రీపాల్ రెడ్డి, పోతరావేన సతీష్ మండల రాజయ్య, ఎండి అకీమ్, దిలీప్, ప్రశాంత్, ఎండి సలీం, గెల్లు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాహుబలి.2ని పుష్ప.2 బీట్ చేస్తుందా..?






ప్రస్తుతం పాన్ ఇండియా ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప 2. 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది ఈ చిత్రం. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా విడుదలకు ఇంకా నెల రోజులు కూడా లేదు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటుంది. మరోవైపు ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా టీం కూడా ఫుల్ బిజీగా గడుపుతుంది. ఇప్పటికే ఇండియా వైడ్ భారీ ఈవెంట్‌లను ప్లాన్ చేసిన చిత్రబృందం బిహార్ రాజధాని పాట్నాలో పుష్ప 2 ట్రైలర్‌ను నవంబర్ 17న లాంఛ్ చేయనుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా సృష్టించే రికార్డులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఏమో ఈ సినిమా అమీర్ ఖాన్ నటించిన దంగల్ రికార్డును బద్దలు గొడుతుందని కామెంట్లు చేస్తుండగా.. మరికొందరు ఈ మూవీ ప్రభాస్ ఆల్‌టైం రికార్డు ఉన్న బాహుబలి 2 సినిమా కలెక్షన్లను బద్దలు కొడుతుందని కామెంట్లు పెడుతున్నారు. ఒకవేళ ఇదే జరిగితే అల్లు అర్జున్ పుష్ప2 సినిమాతో సరికొత్త రికార్డును సృష్టించనున్నాడు. ఎందుకంటే ఇప్పటివరకు అత్యధిక కలెక్షన్లు సాధించిన ఇండియన్ సినిమాలు చూసుకుంటే మొదటి స్థానంలో అమీర్ ఖాన్ నటించిన దంగల్ (రూ.2100 కోట్లు) ఉండగా.. రెండో స్థానంలో బాహుబలి 2(రూ.1800 కోట్లు) ఉంది. వీటి తర్వాత ఆర్ఆర్ఆర్(రూ.1300 కోట్లు), కేజీఎఫ్(రూ.1200 కోట్లు) చిత్రాలు ఉన్నాయి. పుష్ప పార్ట్ 1 చిత్రం ఇండియా వైడ్‌గా రూ.400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ చిత్రంకు వచ్చిన పాపులారిటీ వలన ఇప్పుడు కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# సందీప్‌రెడ్డి వంగా తో ప్రభాస్ మూవీ





గ్లోబల్ స్టార్ ప్రభాస్ యానిమల్ ఫేం సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేయబోతున్నాడని తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్. కాగా సినిమా ఎప్పుడు మొదలవుతుందంటూ తెగ చర్చించుకుంటున్న అభిమానులకు క్లారిటీ ఇచ్చేశాడు టీ సిరీస్ ఎండీ భూషణ్‌కుమార్. ఈ విషయంపై భూషణ్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇస్తూ.. స్పిరిట్ సినిమా పూజా కార్యక్రమం డిసెంబర్‌లో ఉండబోతుంది. సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం స్క్రిప్ట్ రైటింగ్‌తోపాటు మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి పాటలు సిద్ధం చేసే పనిలో ఉన్నాడు. స్పిరిట్ పూర్తిగా కాప్ డ్రామా నేపథ్యంలో ఉండబోతుంది. రెగ్యులర్ షూటింగ్ 2025 జనవరి నుంచి షురూ కానుంది. త్వరలోనే దీని గురించి ప్రకటిస్తాం. అంతేకాదు కేవలం 6 నెలల గ్యాప్‌లోనే స్పిరిట్ షూట్ పూర్తి చేస్తాం. 2026 ప్రథమార్థంలో విడుదల చేస్తామని క్లారిటీ ఇచ్చాడు. భూషణ్ కుమార్ కామెంట్స్ ప్రభాస్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. స్పిరిట్‌లో పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ మడాంగ్‌సియోక్ విలన్‌గా కనిపించబోతుండగా.. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ పాన్ ఆసియన్ మూవీని భారతీయ భాషలతోపాటు చైనీస్, కొరియన్ భాషలో విడుదల చేసేలా ప్లాన్ రెడీ చేసిందట సందీప్ రెడ్డి వంగా టీం. ఇక ప్రభాస్ కెరీర్‌లో తొలిసారి స్పిరిట్ సినిమా కోసం ఖాకీ డ్రెస్ వేసుకుంటుండటంతో ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నారు అభిమానులు. ఈ మూవీని సందీప్‌రెడ్డి వంగాతో కలిసి టి సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ స్పిరిట్ నిర్మిస్తున్నారు.

# కంగువా స్పెషల్ షోకు సర్కార్ అనుమతి



దర్శకుడు సిరుత్తై శివ - హీరో సూర్య కాంబినేషన్‌లో రూపొందిన 'కంగువా' చిత్రం ఈ నెల 14వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానున్న నేపథ్యంలో అదనపు ఆట (స్పెషల్ షో)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రోజూ ప్రదర్శించే నాలుగు ఆటలతో పాటు అదనంగా మరో ఆట వేసేందుకు అంగీకారం తెలిపింది. అయితే, తొలి షో ఉదయం 9 గంటలకు, చివరి ఆట అర్ధరాత్రి 2 గంటల్లోపు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ సహా ఏకంగా పదికిపైగా భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పెషల్ షో ప్రదర్శనకు అనుమతివ్వాలంటూ నిర్మాణ సంస్థ చేసిన విజ్ఞప్తికి తమిళ నాడు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక్క రోజు మాత్రమే అదనపు ఆట ప్రదర్శించుకునేందుకు అనుమతిచ్చింది. ఇటీవల ఏ సినిమాకు కూడా తమిళనాడు ప్రభుత్వం అదనపు షోలకు అనుమతి ఇవ్వలేదు. ఒక థియేటర్‌లో బెనిఫిట్ షో జరిగిన యాక్సిడెంట్ తర్వాత, తమిళనాడు ప్రభుత్వం అదనపు షోలకు అనుమతి నిరాకరిస్తూ వస్తోంది. పెద్ద హీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి వారి సినిమాలకు కూడా అదనపు షోలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇంతకు ముందు వచ్చిన విజయ్ 'ది గోట్' సినిమాకు మాత్రం ఉదయం 9 గంటల ఆటలకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు సూర్య సినిమాకు ఉదయం 9 గంటల ఆటతో పాటు రాత్రి 2 గంటల లోపు మరో ఆటను ప్రదర్శించుకునేలా అనుమతి ఇవ్వడం విశేషం. అయితే, అనుమతి ఇచ్చినప్పటికీ అది ఒక్క రోజుకే పరిమితం చేయడం గమనార్హం. అలాగే ఎర్లీ మార్నింగ్ షోలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇదిలా ఉంటే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం 'కంగువా' తొలి ఆట తెల్లవారు జామున 4 గంటలకే ప్రదర్శించనున్నారు. తమిళనాడులో మాత్రం ఇలాంటి అనుమతి లభించలేదు. ఈ ఒక్కరోజు అనుమతి ఇవ్వడానికి కూడా కారణం విజయ్ పెట్టిన పార్టీనే అని తెలుస్తోంది. ప్రభుత్వాలు సరిగా పనిచేయడం లేదని, అందుకే తను పార్టీ పెట్టాల్సి వస్తుందనేలా విజయ్ చేసిన కామెంట్స్‌తో.. ఇకపై సినిమాల విషయంలో, అందులోనూ స్టార్ హీరోల సినిమాల విషయంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలను సడలించే ప్రయత్నం చేస్తోంది. సూర్య 'కంగువా' సినిమాతో ఆ సడలింపులు మొదలయ్యాయి.


## ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో కాంతర నటుడు



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. రానున్న ఈ ప్రాజెక్ట్ రీసెంట్‌గా లాంఛ్ అవ్వగా.. డిసెంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేయనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌లో మరో స్టార్ నటుడు నటించనున్నట్లు తెలుస్తుంది. కాంతారతో పాన్ ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకున్న రిషబ్ శెట్టి ఈ సినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రిషబ్‌తో పాటు ప్రశాంత్ నీల్ కజిన్. కన్నడ రోరింగ్ స్టార్ శ్రీ మురళిని కూడా ఈ మూవీకి అనుకుంటున్నట్లు సమాచారం. కాగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించబోతుండగా.. జనవరి 09 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తారక్ ప్రస్తుతం వార్ 2 సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. వార్ 2 షూటింగ్ అనంతరం ప్రశాంత్ నీల్ సెట్స్‌లో జాయిన్ అవ్వనున్నాడు. మరోవైపు ప్రశాంత్ నీల్ కూడా సలార్ 2 ప్రాజెక్ట్‌ను రీసెంట్‌గా మొదలుపెట్టాడు.

## లేడీ సింగమ్ వచ్చి తీరుతుంది

బాలీవుడ్ అగ్ర దర్శకుడు రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లో పోలీసు పాత్రలకు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఆయన తెరకెక్కించిన 'సింగమ్ అగైన్'లో ప్రముఖ కథానాయిక దీపికా పదుకొణెని డి.సి.పి శక్తి శెట్టిగా అతిథి పాత్రలో చూపించారు. కానీ లేడీ సింగమ్‌తో పూర్తిస్థాయి నాయికా ప్రాధాన్య చిత్రం చేయాలని రోహిత్ ఆలోచన. కానీ అది పట్టాలెక్కడం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రోహిత్ ఈ విషయం పై స్పష్టతనిచ్చారు. "దీపిక పదుకొణెతో లేడీ సింగమ్ తరహా సినిమా కచ్చితంగా ఉంటుంది. నా మనసులో ఆ కథకు సంబంధించిన బలమైన ఆలోచన ఉంది. కానీ దాన్ని స్క్రిప్ట్‌గా మార్చడానికే కుదర లేదు. ఏది ఏమైనా లేడీ సింగమ్ సినిమా అయితే కచ్చితంగా ఉంటుంది"అని చెప్పారు.



## ఫస్టాఫ్ అద్భుతం.. సెకండాఫ్ అంతకు మించి ఉంటుంది: రష్మిక



బాక్సాఫీస్ వద్ద 'పుష్ప' రూల్‌కు సమయం దగ్గరవుతోంది. దాదాపు 21 రోజుల్లో 'పుష్ప ది రూల్' విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే 'పుష్ప 2' షూట్‌కు సంబంధించి నటి రష్మిక ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. చిత్రీకరణ ఆద్యంతం చాలా సరదా జరిగిందని చెప్పిన ఆమె.. షూట్ చివరి దశకు చేరుకుందని తెలిపారు. డబ్బింగ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. డబ్బింగ్ స్టూడియోలో దిగిన ఫొటోని షేర్ చేశారు.

"ఫన్, గేమ్స్ ఇక పూర్తయ్యాయి. పనిలో బిజీ అయ్యా..! 'పుష్ప ది రూల్' చిత్రీకరణ దాదాపు పూర్తి అయింది. ఫస్టాఫ్ డబ్బింగ్ పనులు కూడా పూర్తి చేశా. సెకండాఫ్ కోసం డబ్బింగ్ చెబుతున్నా. మై గాడ్.. ఫస్టాఫ్ అద్భుతంగా ఉంది. సెకండాఫ్ అంతకు మించి ఉంటుంది. మాటల్లో చెప్పలేకపోతున్నా. మీరు తప్పకుండా మైండ్ బ్లోయింగ్ అనుభూతిని పొందనున్నారు. ఈ చిత్రాన్ని మీకు చూపించేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా. షూట్ పూర్తి అవుతున్నందుకు బాధగా ఉంది" అని రష్మిక చెప్పారు. 2021లో విడుదలైన 'పుష్ప ది రైజ్'కు కొనసాగింపుగా ఇది సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్‌లో ఇది తెరకెక్కుతోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. ఎర్ర చందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రానున్న ఈ సినిమాలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, శ్రీవల్లిగా రష్మిక కనిపించనున్నారు. పార్ట్ 1లో ప్రేమికులుగా వీరిద్దరూ కనిపించారు. 'పుష్ప 2'లో భార్యాభర్తలుగా కనిపించనున్నారు. గత చిత్రంలో స్పెషల్ సాంగ్ కోసం సమంత కనిపించగా.. సీక్వెల్‌లో ఐటమ్ సాంగ్‌కు శ్రీలీల డ్యాన్స్ చేయనున్నారు. ఫైనల్ కట్ పూర్తైందని దాదాపు మూడు గంటల నిడివి ఉందని సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే టీమ్ ప్రకటించింది. ఇండియాలో 6,500.. ఓవర్సీస్‌లో 5,000 స్క్రీన్స్‌లో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు